కథా నిలయం
4640
శ్రీకాకుళం



# అత్యవసర సమావేశం

విశ్వాంతరాళంలో ఎక్కడో ఉన్న ఏదో లోకంలో సృష్టికర్త ఓ అత్యవసర సమావేశం ఏర్పరచాడు. అధ్యక్ష స్థానంలో బ్రహ్మ కమలాసనంలో కూర్చున్నాడు. శివకేశవులూ, సరస్వతి, పార్వతి, లక్ష్మిలు డైరెక్టర్ల హోదాలో తమ తమ ఆసనాల్ని అలంకరించారు. ఛీఫ్ ఎడ్మినిస్ట్రేటర్ హోదాలో ఇంద్రుడూ, దిక్కుల ప్రతినిధులుగా అష్టదిక్పాలకులూ తమ తమ స్థానాల్లో ఆసీనులయ్యారు.

బ్రహ్మ తన ముందునున్న కార్యక్రమం చదువుకొని, ఆ తర్వాత శ్రీ విష్ణువు వైపు చూస్తూ, సభనుద్దేశించి అన్నాడు :

"శ్రీ విష్ణువు ప్రపంచ పరిరక్షణా కార్యక్రమం ఎలా కొనసాగుతుందో సమాచారమిస్తాడు. అందరూ శ్రద్ధగా వినండి."

విష్ణువు గొంతు సవరించుకొని మొదలుపెట్టాడు. "కృత, త్రేతాయుగాల్లో ధర్మసంరక్షణ పరిపూర్ణంగా జరిగింది. ఎందుకంటే అప్పుడు ప్రభువులూ, ప్రజలూ కూడా ధర్మనిరతులు. ద్వాపరాంతంలో సమాజ స్వరూపంలో మార్పులు కనవచ్చాయి. దాయాదులమధ్య రాజ్యాల విషయమై తగాదాలు తలెత్తి, యుద్ధానికి దారితీశాయి. ఆ సమయంలోనే నేను కృష్ణావతారమెత్తి శిష్టసంరక్షణ దుష్టసంహారం కావించాను. కానైతే 'కలి' ప్రవేశించేసరికి ప్రపంచ ప్రజలు తెలివి మీరి, అనిశ్చల పరిస్థితుల్ని కల్పించారు. వాటిని అదుపులో పెట్టడం నా తరం కాలేదు".

"అవతారాలెత్తి పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అదుపులో పెట్టమని నిన్ను ఆదిలోనే ఆదేశించాను. కలియుగంలో నువ్వెందుకు అవతారాలెత్తలేదు?"

"ద్వాపర యుగం వరకూ దైవదత్తమైన మంత్రబలంతో ప్రజల్ని దేవుళ్ల మీద భక్తి విశ్వాసాలుండేటట్లు చేయగలిగాం. అన్ని మహిమలు ప్రదర్శించినా కూడా, దుర్యోధనుడు మొండికెత్తి యుద్ధానికి తలపడిన విషయం మీకందరికీ తెలుసు. కలియుగంలో కూడా జగద్రక్షకాంశతో చాలామంది యుగపురుషులవతరించారు. వారిలో జ్ఞానులున్నారు. యోగులున్నారు. వేదాంతులున్నారు, మత ప్రవక్తలున్నారు, పీఠాధిపతులున్నారు. అయినా వారెవ్వరూ తాత్కాలికంగా తప్ప, శాశ్వతంగా ప్రజల ధోరణి మార్చలేకపోయారు."

"ఎందుకని?" బ్రహ్మ ప్రశ్నించాడు.

"ద్వాపరంలోనే మంత్రబలం క్షీణించసాగింది. కలిలో శాస్త్ర విజ్ఞానం అంతులేని ప్రగతి సాధించి సాధించి, యంత్ర బలాన్ని సుస్థిరం చేసింది. దాంతో హేతువాదం తలెత్తింది. నాస్తికత్వం చోటు చేసుకుంది. స్వార్థం పెరిగింది. మంచికీ, చెడుకీ అర్థాలు మారిపోయాయి. జనాభా పెరిగింది. ధర్మచింతన చేసే వారి సంఖ్య తరిగింది. సూక్తులకీ, సుభాషితాలకీ విలువ పోయింది."

"నాస్తికత్వం పెరిగిందన్నావు. అయినా దేవాలయాల్లో యాత్రీకుల రద్దీ ఎందుకు ఎక్కువైంది?"

"దేవుడికి దణ్ణం పెడితే ప్రాయశ్చిత్తం లేకుండా పాపాలు పోతాయని, శ్రమ పడకుండా కష్టాలు తీరుతాయని దేవాలయ దర్శకుల సంఖ్య పెరిగిందే కాని, చిత్తశుద్ధితోనూ కాదు, భక్తి

భావనతోనూ కాదు! దేవాలయాలు కూడా భక్తుల భావనని సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టాయి. విగ్రహ దర్శనం దగ్గర్నుంచి ఫల పుష్పాదుల అర్పణ వరకూ టిక్కెట్లు పెట్టి, అడుగడుక్కీ హుండీలు పెట్టి, ఊరికే యివ్వవలసిన ప్రసాదాలని అమ్మకం పెట్టి, దేవాలయాలు కూడా వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి!"

"దేవాలయాల మీది ఆదాయం ప్రజాశ్రేయస్సు కోసం వినియోగింపబడట్లేదా?"

"ఇదివరకు దేవుడికి ప్రతినిత్యం దీపం పెట్టడానికీ, పండుగలు చెయ్యడానికీ, అర్చకుల భుక్తికీ, భక్తుల ప్రసాదాలకీ, ఖర్చుల నిమిత్తం ఉన్న ప్రభువులు మడులూ, మాన్యాలు దానం చేశారు. వాటిని తదుపరి తరాల్లోని ఊరి పెద్దలు కైవసం చేసుకొంటే, పూజార్లు గోల పెట్టారు. కాని గుడి దేవుళ్ళు మట్టుకు రాళ్ళ లాగానే మౌనంగా ఉండిపోయారు. దాంతో ప్రజలకీ కొంత దేవుళ్ల మీద నమ్మకం పోయింది. హుండీల్లో భక్తులు వేసిన సొమ్ములు కొంతవరకూ విద్యాలయాలకీ, వేద పాఠశాలలకీ, అన్నదానాలకీ ఉపయోగించబడుతున్నాయి. గర్భగుడిలోనూ, ఆలయ ప్రాంగణంలోనూ ఉన్న ప్రతి విగ్రహం ముందూ పూజార్ల సంఖ్య పెరిగింది. ఆలయ నిర్వహణ కోసం ఉద్యోగుల సంఖ్య పెరిగింది. పెద్ద పెద్ద దేవాలయాల్లో ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు ముఖ్య అధికారులుగా నియమించబడుతున్నారు. మరి వీళ్ళందరికీ జీతాలివ్వాలిగా? దేవాలయాల ఆదాయం ఇందుకూ ఉపయోగపడ్తోంది. చిన్న దేవాలయాల్లో ట్రస్టీలు, పెద్ద దేవాలయాల్లో ప్రభుత్వాధికారులు, ట్రస్టీలు కొంత ఆదాయాన్ని స్వాహా చేస్తున్న విషయం కూడా దేవుళ్ళు మూగగానే చూస్తున్నారు.

"ఇంతెందుకూ, ఆ మధ్య అరసవిల్లి సూర్యుడి గుడిలోనూ, విజయవాడ కనకదుర్గ గుడిలోనూ, విగ్రహాల మీదనున్న అభరణాల చోరీ పెద్ద ఎత్తున జరిగింది. ఆ దొంగలకి, ఈ దేవుళ్ళిద్దరూ శాపాలిచ్చారో లేదో తెలియదు కాని, పోలీసులు మట్టుకు ఆ దొంగల్ని పట్టుకోవడంలో ఇంకా కృతకృత్యులు కాలేదు.

ఇంతేకాకుండా, స్వయం ఉపాధి పథకం కింద, దేవాలయాల మీద అనేక మంది ఆధారపడి జీవిస్తున్నారు. గుడి బయట పూజాద్రవ్యాల తట్టలు ఎకానమీ పాక్ పది రూపాయల నుంచి, సూపర్ డీలక్స్ పాక్ నలభై రూపాయల వరకూ అమ్ముతూ, కొన్నవారి పాదరక్షలు ఫ్రీగా చూస్తూ అనేకమంది స్త్రీ పురుషులు జీవనోపాధి చూసుకొంటున్నారు. దేవుడి ఫోటోలూ, చిన్నచిన్న విగ్రహాలూ, రాగి ఉంగరాలు, దీపం సెమ్మలూ వగైరా వగైరాలు అమ్మే దుకాణాలు వెలిశాయి. భక్తుల సౌకర్యం కోసం వసతి గృహాలు వెలిశాయి. గుడి సింహద్వారాల ముందు యాచకుల దండులు పెరిగాయి. అందుచేత దేవాలయాలు భక్తి సౌధాలు స్థాయి నుంచి దిగజారి, భుక్తి సౌధాలుగా మారాయి" – విష్ణువు కాస్త నిరాశా నిస్పృహలతో అన్నాడు.

"మరి నువ్వెత్తిన రామావతారం మీద జనాల్లో భక్తి ఈ రోజు వరకూ పోలేదు. నీ ఆలయ నిర్మాణం కోసం ఎన్నెన్ని..." – బ్రహ్మ ఆగాడు.

"గొడవలు జరిగాయంటారు. ఆ ప్రయత్నాలన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే ద్వంద్వ నీతులు. మతం చెప్పే మంచి మీద నమ్మకముంటే ఆనాడు అనేకమైన ప్రాచీనమైన దేవాలయాలు నాశనమయ్యేవీ కావు, ఈనాడు అయోధ్యలో చరిత్ర పునరావృత్తమయ్యేదీ కాదు! మతమూ, భక్తీ ఫాషన్లైపోయాయి కాని, వాటిలో ధర్మచింతన నశించింది".

"ప్రపంచ పరిస్థితి నానాటికీ దిగజారిపోతోంది. చేసేదేమీ లేదని చేతులెత్తేస్తే ఎలా? సమస్యలు

చెప్పిన వాడివి, వాటికి పరిష్కార మార్గం కూడా సూచించు."

"బ్రహ్మదేవులు పరిహాసం చేస్తున్నారు! ధర్మనిర్మూలన కోసం 'కలి'ని సృష్టించిందీ మీరే! దాన్ని సాకుగా తీసుకొని కలియుగాంతం చేసి, మహా ప్రళయ సృష్టిని ముందుగానే నిర్ణయించిన మేధావులూ మీరే! కాలరీతిని తిరస్కరించి సన్మార్గ ప్రవర్తన అనుసరించడం, బోధించడం జ్ఞానులకీ, మునులకీ 'కలి'లో మీరు ఆదేశించిన కర్తవ్యాలు. వాళ్ళు చేసే బోధనల్ని వినే పరిస్థితిలో లేరు ప్రజలు. పెరిగిన జనాభాకి కావల్సింది మోక్ష మార్గం కాదు, భుక్తి మార్గం! అందుకనే, నేనింక అవతారాలెత్తి ప్రయోజనం లేదు! నా పనైపోయింది! లయ మీ సృష్టి రచనలో ఆఖరి భాగం. దాన్ని అడ్డుకొనే శక్తి నాకు లేదు!" – విష్ణువు ముగించాడు.

బ్రహ్మదేవుడు శివుని వైపు చూస్తూ – "త్రినేత్రా నీ కార్యక్రమం ఎలా సాగుతోందీ సభ్యులకి వివరించు" అన్నాడు.

శివుడు పార్వతి కేసి ఓసారి చూసి, ఆ తర్వాత బ్రహ్మ వైపు తిరిగి మొదలుపెట్టాడు :"సృష్టి ఆరంభంలో సరస్వతీదేవి కోరిక మేరకు జీవరాశుల పునరోత్పత్తి కార్యక్రమం జీవరాశులకే అప్పగించారు. తన కార్యసాఫల్యత కోసం హరి కోరినట్టుగా, మానవులకి మేధస్సునీ, మాటనీ యిచ్చారు. పునరోత్పత్తి కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగడానికి భావప్రాప్తి కలిగించమని నేను కోరినప్పుడు మీరు 'తథాస్తు' అన్నారు. హరి మనిద్దరం కలిసి కొంపముంచామన్నాడు! ఆ కోరికను నేను కావాలనే కోరి, సృష్టి ఆరంభంలోనే 'లయా'నికి కూడా నాంది పలికాను.

"ప్రకృతి భీభత్సాలు, ప్రమాదాలు, రోగాలు, ఉగ్రవాదాలు, తీవ్రవాదాలు, ఈ చివరి రెండింటినీ అరికట్టే ప్రభుత్వ ప్రయత్నాలు, అంతర్యుద్ధాలు, సరిహద్దుల్లో దేశాలు చేస్తున్న యుద్ధాలు జన నష్టాన్ని కలిగిస్తూనే ఉన్నా, పెరుగుతున్న జనాభాతో పోలిస్తే ఆ సంఖ్య ఓ లెక్కలోనిది కాదు.

"ఒకప్పుడు ఆహారం కోసం, ముడి ఖనిజాల కోసం, తత్కారణంగా దేశాక్రమణ కోసం యుద్ధాలు సరిహద్దుల్లో జరిగాయి. తర్వాత రెండు ప్రపంచ మహాసంగ్రామాలు దేశాల కూటమిల మధ్య జరిగాయి. రాతి చమురు (పెట్రోలు) కోసం మధ్య ప్రాచ్యంలో జరిగిన ఆధునిక సాంకేతిక యుద్ధాన్ని (హైటెక్ వార్) మనం కూడా చూసి మానవుడు సాధించిన ప్రగతికి విస్తుపోయాం. రానున్న కాలంలో మంచినీళ్ళ కోసం కూడా యుద్ధాలు జరగబోతున్నాయి.

"సామాజిక ప్రయోజనాల కోసం కనిపెట్టబడిన అణుశక్తిని, సమాజ నాశనం కోసం ఆయుధంగా ఉపయోగించడం నేర్చుకొన్న మానవులు, ఎంతకాలం నిగ్రహంగా ఉంటారన్నది చెప్పడం కష్టం.

"జనాభాతో పాటు, రోగనిరోధక శక్తిని సంతరించుకొన్న రోగకారక క్రిములు కూడా అభివృద్ధి పొందాయి. వైద్యరంగం ఎంత అభివృద్ధి పొందినా, అంతు చిక్కని రోగాలు అవతరించాయి. రాచ కురుపుని మించిన 'రాచరోగం' ఎయిడ్స్ అంచెలంచెలుగా ప్రపంచాన్ని చుట్టబెడ్తోంది.

"మూడో ప్రపంచ యుద్ధం కనక వస్తే, యుగాంత సమయం రాకుండానే, కలి ప్రథమ పాదంలో ఒక్క మానవజాతే కాదు, జీవరాశులన్నీ నాశనమవుతాయి. ధృవాల్లో మంచు కరిగి నేలంతా నీటిలో మునుగుతుంది.

"ఒకవేళ అణ్వాస్త్ర ప్రయోగాల్ని మానవులు నిరోధించగలిగినా, అవరోధం లేకుండా పెరుగుతున్న జనాభా వల్ల అరణ్యాలు నశించి, వాతావరణం కలుషితమై, బొగ్గు పులుసు

వాయువు శాతం అధికమై, తత్ఫలితంగా వసుధ వేడెక్కి ధృవాల్లోని మంచు కరిగి, ప్రస్తుతం ఉన్న మూడు వంతుల నీరూ, నాలుగు వంతులవుతుంది.

"సృష్టిలో మీ ప్రళయ రచన నిజమవడం తథ్యం! అయితే యిందాకా చెప్పినట్టుగా, అనుకొన్నదానికంటే ముందుగానే జరగడానికి ఆస్కారం ఎక్కువ. నా లయ కార్యక్రమం నిర్ణీత సమయానికి చాలా ముందుగానే పరిసమాప్తి అవుతుంది. బ్రహ్మదేవులు నిశ్చింతగా ఉండొచ్చు!"

"యుగాంతం వరకూ, మహా ప్రళయం సంభవించే వరకూ జీవరాశుల్ని రక్షించడమెలా? శివా, లయ కార్యక్రమాన్ని ముందుగానే జరపకూడదు. యుగారంభాలూ, యుగాంతాలూ ఒక్క లెక్క ప్రకారం నిర్ణయింపబడిన బ్రహ్మాండ రహస్యాలు. పరిష్కార మార్గం సూచించు" అన్నాడు బ్రహ్మ కాస్త ఆందోళనగా.

"నేను లయకారకుణ్ణి. నా పని భక్షణ కాని రక్షణ కాదు!" – శివుడు నిక్కచ్చిగా చెప్పేశాడు.

"ఒక్కొక్కప్పుడు పెద్దలు సూచించలేని పరిష్కార మార్గాలు, పిన్నలు చెప్పడానికి ఆస్కారం ఉంది" అంటూ బ్రహ్మదేవుడు ఇంద్రాదుల వైపు దృష్టి సారించాడు. యింద్రుడేదో అనబోయి ఆగాడు.

"యింద్రా, సంకోచించక చెప్పు" అన్నాడు బ్రహ్మ.

"విధాతా, వేళ్ళ మీద లెక్కపెట్టకలిగినా, భూలోకవాసులు మరణం తర్వాత అప్పుడప్పుడూ స్వర్గం చేరుకుంటున్నారు. మానవ దేహాల్ని ఆశ్రయించిన ఆత్మలతో బాటు వైరస్‌ల ఆత్మలు కూడా, స్వర్గానికి రావన్న నమ్మకమేమిటి? స్వర్గసుఖాలనుభవించడం కోసం, ఆ ఆత్మలకి రూపధారణ చెయ్యడం జరుగుతోంది. వారి ద్వారా, దేవవేశ్యల ద్వారా దేవతలకందరికీ ఎయిడ్స్ సోకే ప్రమాదముందని భయంగా ఉంది. అమృతం కూడా ఎయిడ్స్ వైరస్ మీద పనిచేయదని అశ్వినీ దేవతలు భయపడుతున్నారు. అందుకని ముందు మరణించిన మానవులందర్నీ నరకానికే పంపడం మంచిది" అన్నాడు యింద్రుడు.

యముడు ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి అన్నాడు: "ఎయిడ్స్ వచ్చిన వాళ్ళందరూ చెడ్డవాళ్ళు కాదు. నరక స్వర్గాలు చేరడమనేది, జీవుల పాపపుణ్యాలు బేరీజు మీదే కాని, మరణ కారణాల వల్ల కాదు. అయినా బ్రహ్మదేవులు ఓ సమస్యకి పరిష్కారం అడుగుతున్న సమయంలో రామాయణంలో పిడకల వేటలా మరో సమస్యని ఆయన ముందుచడం భావ్యం కాదు!"

యముడి మాటలకు అందరూ చిన్నగా నవ్వారు. యింద్రుడు చిన్నబుచ్చుకొన్నాడు. యముడు ఊరుకోకుండా ఇంకా చెప్పి పొడిచాడు: "అసలు ఎయిడ్స్ స్వర్గం నుంచే సుఖాలనుభవించి, పుణ్యం తీరి పునర్జన్మలు ఎత్తిన మానవుల ద్వారానే భూలోకంలో అవతరించిందని నా అనుమానం!"

ఈ మాటు సభ్యులు గట్టిగా నవ్వారు.

"యమా, పెద్దవాళ్ళనలా అనడం భావ్యం కాదు. సభా గౌరవం పాటించు" అన్నాడు బ్రహ్మ మందలింపుగా. తననవలసిన మాట అనేశాడు. బ్రహ్మ మందలించినా, యముడికి సరదాగానే ఉంది. శివుడు యముణ్ణి చూసి మందహాసం చేశాడు. యముడు తృప్తిగా కూర్చున్నాడు.

"యముడన్నట్టుగా అసలు విషయం పెడదారి బట్టింది. పరిష్కార మార్గం సూచించండి"

అన్నాడు బ్రహ్మ.

ఎవరూ మాట్లాడలేదు.

"విష్ణూ! నిర్ణీత యుగాంత సమయం వరకూ, జీవరక్షణ చేసే విధి నీదే. తప్పించుకొని కూర్చోడం ఉచితం కాదు. అయినా నువ్వు తప్ప మరెవరూ మార్గం సూచించలేరు!"

మందలింపు! అందులో వెనువెంటనే పొగడ్త! తను మౌనం వహిస్తే సభాపతిని అవమానపరిచినట్లే. విష్ణువు అన్నాడు: "సృష్టికార్యంలో భావప్రాప్తిని లేకుండా చెయ్యడమే!"

"బ్రహ్మ వాక్కుకీ, రాముని బాణానికీ తిరుగులేదు. వయసులో కామాన్నీ, రతిలో సుఖాన్నీ వెనక్కుతీసుకొనే హక్కు నాకు లేదు! మరో మార్గం చెప్పు" అన్నాడు బ్రహ్మ.

"మరణం తర్వాత ఏమవుతుందోనన్న భయం కొద్దీ జీవుణ్ణి బంధించి దేహం ప్రాకులాడుతుంది. దేహాన్ని వదలకుండా ఉండేందుకు జీవుడు ప్రయత్నిస్తాడు. అందుకని ప్రాణరక్షణ కోసం ఉన్నదంతా హరించుకుపోతున్నా, మానవులు చెయ్యని ప్రయత్నం లేదు. పుట్టిన జీవికి జీవించడమనేది ప్రాథమిక హక్కు. అందుకని జనాభా పెరుగుదల మూలంగా వచ్చిన సమస్యలకి పరిష్కారం మరణం కాదు. జననాలని, అదుపులో పెట్టడమే సమాధానం.

"మొదటగా 'కుటుంబ నియంత్రణ' లోకశ్రేయస్సు దృష్ట్యా పాపం కాదని చెప్పే మత ప్రవక్తల్నీ, పీఠాధిపతుల్నీ అన్ని మతాల్లోనూ అవతరింపచెయ్యాలి. కుటుంబ నియంత్రణ పద్ధతుల్ని ప్రోత్సహించిన వారికీ, ఆచరణలో పెట్టిన వారికీ స్వర్గ ద్వారాలు తెరుచుకోవాలి. 'సంతాన ప్రాప్తిరస్తు, పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు' అని దీవించిన వారి నోరు పడిపోవాలి. వైద్యరంగం సాధించిన కృత్రిమ గర్భధారణ పద్ధతుల్ని అవలంభించిన వారు నరకానికీ, అనాథ బాలల్ని దత్తత తీసుకొన్న వాళ్ళు స్వర్గానికి పోవాలి."

"తథాస్తు! అయినా హరీ, దేముడి మీద నమ్మకం నశించిన మానవులకి స్వర్గ సుఖాలు ఆశపెడితే, కుటుంబ నియంత్రణ పథకాల్ని ఆచరిస్తారా?" – బ్రహ్మ ముందు అలాగే అని, తర్వాత అనుమానం వ్యక్తం చేశాడు.

"నేను చెప్పే ముఖ్యమైన సలహా ఇంకోటి ఉండిపోయింది. రేపటి ఓటర్ల కోసం ఆశించకుండా, దేశ శ్రేయస్సు కోసం సంజయ్ గాంధీ లాంటి దమ్ములున్న వ్యక్తులు మాత్రమే ఎన్నికల్లో నెగ్గేటట్టు వరం ప్రసాదించు –

"జనాభా తగ్గిపోతే అన్ని దేశాలూ బాగుపడ్తాయి. ఋణగ్రస్తమైన ఆర్థిక వికాసం నుంచి విముక్తి పొంది, నిజమైన ఆర్థిక వికాసాన్ని దేశాలు పొందుతాయి. ఒకసారి నాగసాకీ, హిరోషిమాల్లో జరిగిన దారుణ విధ్వంసకాండ కళ్ళారా చూసిన మానవజాతి, అణ్వాయుధాల్ని మళ్ళీ ఉపయోగిస్తుందని అనుకోను. జననాల్ని తగ్గిస్తే, వసుధ యుగాంతం వరకూ జీవించి జీవులకి ఆశ్రయమిస్తుంది" – విష్ణువు ముగించాడు.

"నేను చెప్పాను కదా, పరిష్కార మార్గం నువ్వే చూపించగలవని!" – బ్రహ్మ నవ్వుతూ అన్నాడు.

"మీ అభిమానానికి ధన్యవాదాలు" అన్నాడు విష్ణువు నమ్రతగా.

"వీధికోశాల్తీ చొప్పున ఆ సంజయ్ గాంధీ అవతారాల్ని నువ్వే ఎందుకు ఎత్తకూడదు?" బ్రహ్మ సీరియస్‌గా అన్నాడు.

సభలో నిశ్శబ్దం ఆవరించింది. ●